బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం, 30 జూలై-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ట్రైనీ ఐపిఎస్ కృష్ణరెడ్డికి 14రోజుల రిమాండ్



## ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు



# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం
- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 29 : వాడీవేడీ చర్చలు.. విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజు వాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయా లంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్న పత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది.



విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

మిగతా 3లో..

# కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

- వారి హయాంలోనే కట్టడం..కూలడం చూశాం
- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,జూలై29 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం



రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం

మిగతా 3లో..

## బిజెపి ప్రాపకం కోసం కెటిఆర్ పాట్లు



- ఢిల్లీ పర్యటన మతలబు ముమ్మాటికీ అదే
- ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపణ

మిగతా 3లో..

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

- కాంగ్రెస్ బిఎల్‌ఎలకు భట్టి ఆదేశం

న్యూఢిల్లీ,జూలై29 : ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎలాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు



భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ఃూఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

మిగతా 3లో..

# దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం
- ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూలై 29 : దేవాదాయశాఖ



ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన

మిగతా 3లో..

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

- పర్యావరణ అనుముతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం

న్యూఢిల్లీ, జూలై 29 : తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అను మతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్య నిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో

మిగతా 3లో..

# అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణాలు పెంచాలి
- అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్,జూలై29 : ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ-సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు,



ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు

మిగతా 3లో..

# వైభవంగా అంబర్ పేట మహంకాళి బోనాలు



- ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి
- ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

హైదరాబాద్,జూలై29 : అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న అంబర్ పేట్ మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాలు జరగనున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ట్రాన్స్ కో, పోలీస్, జలమండలి, వైద్యారోగ్యశాఖ, కల్చరల్ డిపార్ట్ మెంట్ లు సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ బోనాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బోనాల ఉత్స వాలను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరుగుతున్నాయని అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొటటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు,

మిగతా 3లో..

## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు



- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు

మిగతా 3లో..

## పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

- ఖర్గే వ్యాఖ్యలను తిప్పికొట్టిన జెపి నడ్డా

న్యూఢిల్లీ, జూలై 29 : దిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పు బట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లా డుతూ.. అణచివేతకు బాధ్యులైన అధికా రుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని

మిగతా 3లో..

## పేపర్ లీక్‌లకు పాల్పడే వారికి కఠిన శిక్షలు

- బిల్లు పాస్ కావడంతో విద్యార్థులకు అమిత్ షా అభినందనలు



మిగతా 3లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# భార్య అత్తమామల వేధింపులు



## సెల్ఫీ వీడియో తీసుకొని వ్యక్తి ఆత్మహత్య

హైదరాబాద్,జూలై29 : భార్య, అత్తమామల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అంబర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంబర్‌పేట్ డివిజన్ ఉమర్ నగర్‌లో సుల్తాన్ (44) అనే వ్యక్తి పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య అస్మా ఫరిన్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడి అత్త సబియా బేగం మామ షరీఫ్ నిజామాబాద్‌లో ఉంటారు. సుల్తాన్ పండ్ల వ్యాపారంలో వచ్చిన డబ్బులను తన కుమార్తె పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో వేయాలని, ప్రతినెల 5 నుంచి 6 వేల రూపాయలు తన భార్యకు ఇస్తున్నట్లు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. కుమార్తె పేరు మీద డబ్బులు వేస్తున్నానని తన భార్య చెప్పడంతో ఆమెను నమ్మానని అన్నాడు. పోస్టాఫీస్‌కి వెళ్లి చూడగా కుమార్తె అకౌంట్లో కేవలం రూ. 6 వేలు మాత్రమే ఉన్నాయని సుల్తాన్ పేర్కొన్నాడు. అదే విధంగా నిజామాబాద్‌లో స్థలం కొనమని అత్తమామలకు రూ. 3 లక్షలు ఇవ్వగా వారు స్థలం కొనకుండా మోసం చేశారని అన్నాడు. పండ్ల వ్యాపారంలో 20 నుంచి 25 లక్షల రూపాయలు సంపాదించి.. తన భార్యకు ఇవ్వగా ఆమె డబ్బులు లేవని చెబుతోందని సుల్తాన్ వాపోయాడు. పైగా ఆమె అక్రమ సంబంధాలను కలిగి ఉందని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. డబ్బులు అడిగితే ఫరిన్, ఆమె తల్లిదండ్రులు తనను మానసికంగా వేధిస్తున్నారని, వారి వేదన భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వీడియోలో పేర్కొన్నాడు. తన డబ్బులను పిల్లల పేరు మీద ఉంచాలని సుల్తాన్ వీడియోలో వెల్లడించాడు.

# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు




- వాగులు, వంకల్లో పెరుగుతున్న వరద

నిజామాబాద్,జూలై29 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల్లోకి వరద పెరుగుతోంది. సిరికొండ మండలంలో కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహానికి అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. గత 24 గంటల్లో ప్రాజెక్ట్‌లోకి 6585 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1405 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1395.40 అడుగులు, 7.139 టీఎంసీలుగా నమోదు అయ్యింది. గత సంవత్సరం ఇదే రోజు ప్రాజెక్ట్‌లో నీటిమట్టం 1391.25 అడుగులు, 4.597 టీఎంసీలుగా ఉన్న విషయం తెలిసిందే. అటు మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్ట్‌కు కూడా వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్ట్ ఇన్ ఎలో 27,000 క్యూసెక్కులు, ఔవుట్ ఎలో 28000 క్యూసెక్కులుగా ఉంది. అలాగే ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను.. ప్రస్తుత నీటిమట్టం 317.240 మీటర్లకు చేరింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి సామర్థ్యం 7.17 టీఎంసీలుగా నమోదు అయ్యింది. వరద ప్రవాహం నేపథ్యంలో ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో 10 యూనిట్లలో 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# లింగోజిగూడలో ఎమ్మెల్యే సుధీర్ పర్యటన





హైదరాబాద్, జూలై 29 : ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు బుధవారం స్వయంగా పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హనుమాన్ దేవాలయం సమీపంలో వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, నిల్వ నీటిని తొలగించినప్పటికీ కొద్దిసేపటికే మళ్లీ వరదనీరు చేరుతోందని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి గారు సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇంద్ర నాగేంద్ర నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ఉన్న ట్రంక్ లైన్‌లో ఎక్కడైనా చెత్తాచెదారం పేరుకుపోయిందేమో పరిశీలించాలని ఆదేశించారు.ధికారులు వెంటనే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను తనిఖీ చేయగా, పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో డ్రైనేజీ ప్రవాహం నిలిచిపోయి, వర్షపు నీరు కాలనీలోకి చేరుతున్నట్లు గుర్తించారు. అనంతరం మ్యాన్‌హోల్స్ లోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరచడంతో భాగ్యనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు సాఫీగా వెళ్లిపోయింది. సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ నాయకులు తిలక్ రావు, కాలనీ అధ్యక్షులు రాము, జనరల్ సెక్రటరీ జగన్నాథ్ రెడ్డి, రాజు యాదవ్, జగన్మోహన్ గార్లు తదితరులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణ మన బాధ్యత



- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
- అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ

హైదరాబాద్,జూలై29 : పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్ర సాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దే శించి ప్రసంగించారు. ప్రతి సంవ త్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధా న్యతపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవి ధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నా రు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కార ణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభు త్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తు న్నా యని పేర్కొన్నారు. ÷లంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పిం చినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్ర మాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలి పారు.

# పేపర్ లీక్‌లకు పాల్పడే వారికి కఠిన శిక్షలు

## బిల్లు పాస్ కావడంతో విద్యార్థులకు అమిత్ షా అభినందనలు



న్యూఢిల్లీ,జూలై29 : దేశంలోని లక్షలాది మంది పరీక్షార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం ద్వారా పోటీ పరీక్షల్లో పారదర్శకత పెరుగుతుందని, పేపర్ లీకేజీలు, నకిలీ పరీక్షలు, ఇతర అక్రమాలకు అడ్డు కట్ట పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాయతీగా శ్రమించే విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. పేపర్ లీక్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, పరీక్షల గోప్యతను భంగం చేసే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తాం. ఈ చట్టం అమల్లోకి రావడంతో పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిభ ఆధారంగా అవకాశాలు లభించే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది' అని అన్నారు.

# ట్రైనీ ఐపిఎస్ కృష్ణరెడ్డికి 14రోజుల రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- మహిళా ట్రైనీ ఐపిఎస్‌ను ఘోరంగా వేధించినట్లు రుజువులు



హైదరాబాద్,జూలై29 : తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో మంగళవారం అదుపులోకి తీసుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉదయ్‌కృష్ణారెడ్డిని బుధవారం ఉప్పర్ పల్లి కోర్టులో హాజరపరుచగా.. న్యాయమూర్తి అతడికి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్‌కృష్ణారెడ్డి దాడి చేసినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయినట్టు తెలిసింది. కేసు నమోదైన జూలై 18న బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమెపై భౌతికంగా దాడి జరిగినట్టు తేల్చారు. బాధితురాలి గొంతు నులిమినట్టు గాయాల ఆనవాళ్లు, చెంప భాగంలో కొట్టిన కమిలిన గాయా లు, ఎడమ కాలిపైనా గాయం ఉన్నట్టు సమాచారం. నేషనల్ పోలీస్ అకాడమిలో తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు అయిన ఎఫ్ఐఆర్ లో దిగ్భ్రాంతికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెపై మానసికంగా, శారీరకంగా తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న దాని ప్రకారం ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెను వాట్సాప్ ద్వారా లైంగికంగా వేధించడమే కాకుండా, వారిద్దరి మధ్య రిలేషన్ షిప్ ఉందంటూ తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారుల వద్ద అసత్య ప్రచారాలు చేశాడు. అంతటితో ఆగకుండా, మరో ట్రైనీ అధికారితో ఆమెకు అక్రమ సంబంధం ఉందంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అవమానించాడు. బాధితురాలిని అత్యంత అసభ్యకరమైన పదాలతో దూషిస్తూ మానసిక క్షోభకు గురిచేసినట్లు సమాచారం. బాధితురాలికి తెలియకుండానే ఆమె వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసిన ఉదయ్, వాటి ఆధారంగా ఆమెను బ్లాక్ మెయిల్ చేయడానికి యత్నించాడని బాధితురాలు పేర్కొంది. ఆ వీడియోలను ఆమె భర్తకు పంపించి తీవ్ర మనోవేదన కలిగించాడు. అంతేకాకుండా ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తన గదికి తీసుకెళ్లి, పాస్‌వర్డ్ చెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. అదే సమయంలో ఆమెను అసభ్యకరం గా తాకుతూ, తీవ్రంగా వేధించినట్లు ఫిర్యాదులో నమోదైంది. ఈ నెల 9వ తేదీ రాత్రి బాధితురాలిని బలవంతంగా తన గదికి తీసుకెళ్లి బంధించిన ఉదయ్ కృష్ణారెడ్డి, ఆమె జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమేందుకు ప్రయత్నించాడు. గది నుంచి బయటకు వెళ్లకుండా మెడపై కత్తి పెట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. ఆమెను అవమానించే ఉద్దేశంతో మూడు కండోమ్ ప్యాకెట్లను ఆమెపైకి విసిరాడు. అనంతరం ఈ నెల 10వ తేదీ ఉదయం కూడా ఆమెపై తీవ్రంగా శారీరక దాడికి పాల్పడ్డాడు. అకాడమిలో ఇతరుల సమక్షంలోనూ అసభ్యకరంగా మాట్లాడి ఆమె పరువుకు భంగం కలిగించాడని బాధితురాలు తెలిపింది. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# శ్రీ ఓంకారాశ్రమంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

నారాయణపేట,జూలై29 : నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడేబల్లూరు టైరోడ్డు సమీపంలోని కృష్ణానది తీరం ఉన్న శ్రీ ఓంకారాశ్రమంలో బుధవారం గురుపౌర్ణమి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఓంకారానందగిరి గురువును దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా గురుపూజ, పాదసేవ, ధ్యానం, భగవద్గీత పారాయణం, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురువు శిష్యురాలు శివ చైతన్యానంద రచించిన భక్తి గీతాల సీడీని ఆవిష్కరించారు. అదేవిధంగా శ్రీ ఓంకారాశ్రమం అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఓంకారానంద స్వామి మాట్లాడుతూ గురువు చూపే మార్గమే మనిషిని అజ్ఞానాంధకారం నుంచి జ్ఞాన వెలుగులోకి నడిపిస్తుందని అన్నారు. గురువు బోధలను ఆచరణలో పెట్టినవారే నిజమైన శిష్యులని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎల్కోటి నారాయణరెడ్డి, విఠోబా, శివన్న గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

- హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్



హైదరాబాద్,జూలై29 : హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# కామారెడ్డి జిల్లాలో మహిళకు మోసం

- నగదు లెక్కిస్తామని చెప్పి 15వేలతో ఉడాయింపు

కామారెడ్డి,జూలై29 : కామారెడ్డి జిల్లాలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఓ మహిళను దొంగలు మోసం చేసి నగదు కాజేశారు. డబ్బులు లెక్కపెడతామని నమ్మించిన దుండగులు, మహిళ వద్ద ఉన్న నోట్ల కట్టలో నుంచి రూ.15 వేలను చాకచక్యంగా మాయం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన పూజ అనే మహిళ బ్యాంకు పనుల నిమిత్తం కామారెడ్డిలోని ఎస్‌బీఐ శాఖకు వెళ్లింది. బ్యాంకులో నగదు లెక్కపెడుతున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆమెను గమనించారు. అనంతరం ఆమె వద్దకు వెళ్లి డబ్బులను సరిగ్గా లెక్కపెడతామని, నోట్లను పరిశీలిస్తామని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన పూజ తన వద్ద ఉన్న నగదును వారికి ఇచ్చింది. ఈ క్రమంలో దుండగులు ఏమాత్రం అనుమానం రాకుండా వ్యవహరించి, నోట్ల కట్టలో నుంచి రూ.15 వేల నగదును తీసేశారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన బాధితురాలు మోసపోయానని గ్రహించింది. ఆమె ఫిర్యాదు మేరకు బ్యాంకులో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల వివరాలను సేకరిస్తున్నారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే సమయంలో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బాధితురాలికి పోలీసులు ధైర్యం చెప్పారు.

# బ్యాక్‌లాగ్ ఉన్న వారి కోసం మరో అవకాశం

## కాకతీయ వర్సిటీ రిజస్ట్రార్ ప్రకటన

హనుమకొండ,జూలై29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్ణీత కాలవ్యవధిలో కోర్సు పూర్తి చేయలేక బ్యాక్‌లాగ్‌లు మిగిలిన యూజీ, పీజీ పూర్వ విద్యార్థులకు 2026-2027 విద్యాసంవత్సరానికి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. అర్హులైన విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్, ప్రాజెక్ట్ వర్క్, సెమినార్ పరీక్షలకు దరఖాస్తు చేసుకుని తమ కోర్సును పూర్తి చేసుకోవచ్చున్నారు.ఇందుకోసం రిజిస్ట్రార్ అనుమతితో పాటు నిర్దేశిత రుసుములు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. యూజీ, పీజీ విద్యార్థులు ప్రస్తుత బ్యాచ్‌లతో కలిసి పరీక్షలు రాయవచ్చని, పీజీ విద్యార్థులు అవసరమైతే ఎస్డీఎల్సీఈ పరీక్షలతో పాటు ప్రత్యేక అనుమతి పొంది నిర్ణీత రుసుం చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పూర్వవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు.

# (మొదటిపేజీ తరువాయి)

## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷-లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాఫర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ బిల్లుపై మాట్లాడారు.

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతుల మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా అంబర్ పేట మహంకాళి బోనాలు

రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో శాసనమండలి సభ్యులు బల్మూర్ వెంకట్, బిసి సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయదేవి, ఎస్ పిడిసిఎల్ ఎం.డి.జితేష్ వి.పాటిల్,సమాచార,పౌర సంబంధాలశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ జిఎం, ఆర్ టిసి ఇడి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ-సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు. దీంతో రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు



హైదరాబాద్, జూలై 29: రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మంగినపూడి బీచ్ రోడ్డుకు అనుమతించండి





- కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

న్యూఢిల్లీ,జూలై29 : బందరు పోర్టు నుంచి మంగినపూడి బీచ్ మీదుగా రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. ఈ సమావేశంలో చర్చించిన విషయాల గురించి మీడియాకు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించాలని మంత్రి సూచించారు. ప్రతిపాదిత రోడ్డు ప్రభుత్వ భూముల గుండా వెళ్తున్నందున భూసేకరణ సమస్య లేదని తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయితే జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారుతుందని చెప్పుకొచ్చారు. పోర్ట్ ద్వారా ఎగుమతి, దిగుమతి, కంటైనర్ ట్రాఫిక్ ఊపందుకుంటుందని వెల్లడించారు. మచిలీపట్నం ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కులు, క్లస్టర్‌లకు సానుకూలంగా మారుతుందని మంత్రి వివరించారు. మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం పెరిగితే పర్యాటకాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మచిలీపట్నం నుంచి బంటుమిల్లి వరకు 20 కిలోమీటర్ల రోడ్డుకు ఆమోదం తెలపాలని విన్నవించారు. ఈ రోడ్డు పూర్తయితే పోర్టు, పారిశ్రామిక, పర్యాటక, లాజిస్టిక్స్ అభివృద్ధికి ప్రయోజనమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ,జూలై29 : జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

## భారత్ ఒక సజీవ సాంస్కృతిక వారసత్వం

- వందేమాతరం జాతీయ ఆత్మను ప్రతిబింబించే స్వరం
- ఉద్వేగపూరిత ప్రసంగంతో ఆకట్టుకున్న టిడిపి ఎంపి విజయ్



న్యూఢిల్లీ,జూలై29 : రాజ్యసభలో దేశభక్తి, 'వందేమాతరం' విశిష్టతపై టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజ్యసభ సమావేశాల్లో 'నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లు'పై విజయ్ మాట్లాడుతూ.. ఈ క్షణం కేవలం ఓ వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని అన్నారు. భారత ప్రజాస్వామ్య శక్తికి, జాతీయ ఆత్మను ప్రతిబింబించే 'వందేమాతరం' స్వరానికి ప్రతీకగా నిలిచే సందర్భమని అని పేర్కొన్నారు. భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని.. ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని అభివర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో పారే ప్రతి నది గంగతో.. ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొన్నారు. 'మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే... చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకు పోతున్నప్పుడు ఎవరు చెవి పెట్టి విన్నా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అనే శబ్దాలే వినిపిస్తాయి' అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపీ విజయ్ గుర్తు చేసుకున్నారు. 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రూపొందించిన 'వందేమాతరం' అనే రెండు పదాలు కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించాయని అన్నారు. 1908లో కేవలం 18 సంవత్సరాల వయస్సులోనే ఖుదీరామ్ బోస్ ఉరికంభాన్ని ఎక్కుతూ 'వందేమాతరం' అని గర్జించారని గుర్తుచేశారు. అలాగే కాలాపానీ సెల్యులార్ జైలులో వీర్ సావర్కర్ క్రూరమైన చిత్రహింసలను తట్టుకుంటూ 'వందేమాతరం' అని బదులిచ్చారని తెలిపారు. ఆల్ఫ్రెడ్ పార్క్‌లో చంద్రశేఖర్ ఆజాద్ లొంగిపోకుండా ప్రాణాలర్పించే సమయంలోనూ ఇదే నినాదాన్ని పలికారన్నారని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సీపట్నం ప్రాంతానికి చెందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని ఈ సందర్భంగా చింతకాయల విజయ్ స్మరించుకున్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం.. అల్లూరిని చెట్టుకు కట్టేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపినప్పుడు కూడా ఆయన నోటి నుంచి వచ్చిన చివరి మాట 'వందేమాతరం' అని గుర్తుచేశారు. ఈ విప్లవ వీరుని త్యాగానికి గౌరవంగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అల్లూరి సీతారామరాజుకు శిరస్సు వంచి ప్రణామాలు అర్పించారని కొనియాడారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ రాసిన 'బాధాయే ఆతీ హై ఆయే' అనే ప్రసిద్ధ కవితా పంక్తులను సభలో ప్రస్తావిస్తూ.. ఎంతటి ఆటంకాలు వచ్చినా, అగ్నిజ్వాలలు ఎదురైనా అడుగులో అడుగు వేసి ముందుకు సాగాలని ఎంపీ పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే దేశం పురోగమిస్తుందని స్పష్టం చేశారు. 'వందేమాతరం'లో మిగిలిన రెండు చరణాలకు సముచిత స్థానం కల్పించి, గౌరవాన్ని పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు ఈ అవకాశం లభించేలా ప్రోత్సహించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఎంపీ చింతకాయల విజయ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## జగన్ క్రెడిట్ కొట్టేయాల్సిన ఖర్మ పట్టలేదు

### ఎర్రబస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్టా

### గతంలో జగన్ వ్యాఖ్యలను ప్రస్తావించిన కలిశెట్టి

న్యూఢిల్లీ,జూలై29 : భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్.. చంద్రబాబు కొట్టేస్తున్నారంటూ వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదమని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నపుడు భోగాపురం వచ్చి.. ఎర్ర బస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్ట్ ఎందుకన్నారని గుర్తుచేశారు. జగన్ క్రెడిట్ ఎవరూ చోరీ చేయరని.. ఆయన క్రెడిట్ చోరీ చేస్తే జైలుకే వెళతారంటూ సెటైర్ విసిరారు. జగన్ వ్యవహారం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎంపీ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించే విధంగా వైసీపీ అధినేత మాట్లాడారని విమర్శించారు. ఎర్రబస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్ ఎలా వస్తుందని అవహేళన చేశారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రాబోతున్నారని తెలిపారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అద్భుతంగా ముందుకు వెళుతోందని చెప్పుకొచ్చారు. డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్ వేసిన సవాల్‌కు జగన్ పారిపోయారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దేశానికి, తెలుగు ప్రజలకు ఒక ఆదర్శమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కొనియాడారు.

## పార్టీలైన్ దాటి ఎవ్వరూ మాట్లాడవద్దు

### ఎవరు గీతదాటినా కఠిన చర్యలు తప్పవు

### పార్టీ కార్యకర్తలకు పల్లా, నిమ్మల హెచ్చరిక

అమరావతి,జూలై29 : టీడీపీ నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. బుధవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పల్లా శ్రీనివాసరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో టీడీపీ హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసీపీ నేతలతో టీడీపీ నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళులు అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రయత్నిస్తోందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్‌కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు.

## మహిళా కోర్టును ఆశ్రయించిన జోగి కుటుంబ సభ్యులు



విజయవాడ,జూలై29 : తమను అరెస్ట్ చేయొద్దంటూ మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన మహిళా కోర్టు.. కౌంటరు దాఖలు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. జోగి రమేశ్, ఆయన కుటుంబసభ్యులపై ఆయన పెద్ద కోడలు జోగి మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులుగా జోగి రమేశ్, అతని సోదరుడు రాము, సోదరి రమ కుటుంబసభ్యులు 11 మందిని చేర్చారు. జోగి రాజీవ్, రమేశ్, శకుంతల, రోహిత్, ప్రియాంక, జోగి రాము, అతని ఇద్దరు కుమారులు రాకేశ్, పాండు, స్వామి, రమ, సాయి పేర్లను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

# సంపాదకీయం

# హైడ్రా దూకుడుకు హైకోర్టు కళ్లెం !




హైడ్రా తీరు, కమిషనర్ రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. దీనిపై సమీక్షించుకోవడం, ఆత్మవిమర్శ చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించాలి. పెద్దలను వదిలి పేదల ఇళ్లను కూలస్తున్నారన్న అపప్రథ రాగానే చర్యలు తీసుకుని ఉంటే ఇంతటి అపప్రథ వచ్చేది కాదు. కానీ సిఎం రేవంత్ పదేపదే హైడ్రాను సమర్థిస్తూ వచ్చారు. అయితే హైడ్రా వల్ల మంచి పనులు జరగలేదని చెప్పడానికి లేదు. ప్రభుత్వ భూముల కబ్జా, చెరువుల కబ్జాను తొలగించడం వంటి చర్యలను ప్రజలు సమర్థి÷–తూ వస్తూనే ఉన్నారు. కానీ పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడాన్ని ఎవరూ సమర్థించరు. పేదలకు గూడు కట్టివాలనుకున్నప్పుడు వారు ఉన్న ప్రాంతాలను వారికే అప్పగించాలి. కానీ వారిని గూడులేని వారుగా చేయడం సరికాదు. హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్–హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనడంలో సందేహం లేదు. అయితే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు చెడ్డపేరు తెచ్చి పెట్టాయి. చట్టప్రకారం, నిబంధనల మేరకు నడుచుకుని ఉంటే ఇంతగా హైకోర్టు చేత చివాట్లు తినాల్సిన పని వచ్చేది కాదు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వాని చెంపపెట్టుగానే భావించాలి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది. హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమూర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగలముఠా చర్యగా పోల్చింది. రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన పక్రియను పాటించకపోతే హైడ్రాను మూసివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోక పోవడంతో హైకోర్టు ముందు దోషిగా న ఇలబడాల్సి వచ్చింది. లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం పరాకాష్టగా చూడాలి. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది.కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కారణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది. హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్షనేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడం లేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ఇప్పటికైనా హైడ్రా తీరు మారాలి. చట్టబద్ధంగా, నిబంధనల మేరకు నడుచుకుంటే మంచిది. పేదల పక్షాలన నిలబడాల్సిన అసవరం కూడా గుర్తించాలి.

# అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు

### అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు
### వరుసపెట్టి దాడులు చేస్తున్న ఎసిబి
### వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు




**హైదరాబాద్, జూలై28 :** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమారు కొరడా ఝళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపెద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతున్నా, పెద్ద చేపల విషయంలో ఎసిబి పక్కాగా సమాచారం సేకరించి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠినవైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది.ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచాలు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి.కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది.ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన పక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

### కసరత్తు చేస్తున్న ప్రభుత్వం



**హైదరాబాద్, జూలై28 :** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# కీలక బిల్లులుపై ఎన్‌డిఎ ఎంపిలతో మోడీ చర్చ

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం



### ఎన్‌డిఎ పక్ష ఎంపిలతో మంగళ్ మిలన్ భేటీ

**న్యూఢిల్లీ,జూలై29 :** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదు ర్కోవడం, ప్రభుత్వ కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణ యాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోకసభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు–2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమా వేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చు కున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారా యని ఆయన పేర్కొన్నారు. మత్స్య శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

## బిజెపి ప్రాపకం కోసం కెటిఆర్ పాట్లు

- ఢిల్లీ పర్యటన మతలబు ముమ్మాటికీ అదే
- ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపణ



హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ):కేంద్ర మంత్రులను కలుస్తున్నాననే పేరుతో బీజేపీతో కెటిఆర్ రాయబారం నడుపుతున్నట్లు కనిపిస్తోందని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కెటిఆర్ ఢిల్లీ పర్యటనపై వెంకట్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఢిల్లీలో అసలేం పనుందని ప్రశ్నించిన ఆయన.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు కోసమే ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్మెంట్ దొరక్కపోవడంతో తెలంగాణ అంశాల పేరుతో కేంద్ర మంత్రులను కలుస్తున్నట్లు కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెటిఆర్ పార్టీ మనుగడ కోసమే ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నారని వెంకట్ అన్నారు. కేసీఆర్ కోసం ఫామ్‌హౌస్‌లో డమ్మీ అసెంబ్లీ పెట్టే పరిస్థితి వస్తుందేమోనని ఎద్దేవా చేశారు. ఉదయం కేంద్ర మంత్రులను కలుస్తున్నానని చెప్పే కేటీఆర్.. రాత్రివేళ ఎవరిని కలుస్తున్నారో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఇప్పుడు ముగిసిన అధ్యాయమని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలనే ఆ పార్టీ కొనసాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ నుంచే పచ్చి అబద్దాలు చెప్పే రాజకీయ సంస్కృతి బీఆర్ఎస్‌కు వచ్చిందని ఆరోపించారు. హైడ్రాపై చేస్తున్న విమర్శలను కూడా బల్మూరి వెంకట్ ఖండించారు. బఫర్ జోన్‌లో భూములు ఉంటే ఫిర్యాదు చేయాల్సిందేనని, హైడ్రాను కోర్టు తప్పుపట్టలేదని, కేవలం కమిషనర్ కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే వేల ఎకరాల ప్రభుత్వ భూములను, వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడిందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన కీలక పరిణామాలపై కేటీఆర్ స్పందించకుండా సంగ్రామ సభల పేరుతో అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలకు గత ప్రభుత్వంలో భద్రత కల్పించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అవసరమైన భద్రత కల్పిస్తోందని, పెద్ది సుదర్శన్ రెడ్డి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటుచేశారని పేర్కొన్నారు.

# బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

### తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



**హైదరాబాద్, జూలై28 :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకా శముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవా హాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిం చారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెం గాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయు గుండంగాబలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడి శా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో పాటు కూడినవర్షాలుకురుస్తాయని వివరించింది.జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదై నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొ న్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

## బ్యాక్‌లాగ్ విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ చివరి అవకాశం

**2026-27 విద్యా సంవత్సరంలో పరీక్షలు రాసి కోర్సు పూర్తి చేసుకునే వెసులుబాటు**

బలగం టీవీ, వరంగల్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్ణీత కాలవ్యవధిలో కోర్సు పూర్తి చేయలేక బ్యాక్‌లాగ్‌లు మిగిలిన యూజీ, పీజీ పూర్వ విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరంలో చివరి అవకాశాన్ని కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు.ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకునే అర్హులైన విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్, ప్రాజెక్ట్ వర్క్, సెమినార్ పరీక్షలకు దరఖాస్తు చేసుకుని తమ కోర్సును పూర్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం రిజిస్ట్రార్ ప్రత్యేక అనుమతితో పాటు నిర్దేశిత పరీక్షా రుసుములు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

యూజీ, పీజీ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న బ్యాచ్‌లతో కలిసి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. పీజీ విద్యార్థులు అవసరమైతే ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలతో పాటు ప్రత్యేక అనుమతి పొంది నిర్దేశిత రుసుము చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.అర్హులైన పూర్వ విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు. పూర్తి వివరాల కోసం కాకతీయ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



## సిరిసిల్లలో మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ చౌరస్తా ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక రగుడు సమీపంలోని కలెక్టరేట్ చౌరస్తా (జంక్షన్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రోజు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి కలెక్టరేట్ చౌరస్తా అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, స్థల పరిస్థితులను అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.

కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. చౌరస్తా అభివృద్ధి పనులు, పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, ఎమ్మార్వో చంద్రశేఖర్, మున్సిపల్ డీఈ వాణి, ఏఈ నరసింహస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నడుం శ్రీనివాస్, ఉమర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జపాన్ భూకంపంలో 13 మంది మృతి!

**కషీమా పట్టణంలో షాపింగ్ మాల్ కూలి భారీ ప్రమాదం**

**పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఎమర్జెన్సీ డిజాస్టర్ కార్యాలయం.. రంగంలోకి ప్రధాని తకాయిచి**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్ దక్షిణ ప్రధాన ద్వీపమైన క్యూషు పరిధిలో మంగళవారం మధ్యాహ్నం సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని నింపింది. రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో వచ్చిన ఈ వినాశకర భూకంపం ధాటికి ఇప్పటివరకు సుమారు 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు జపాన్ ప్రధానమంత్రి సనాయి తకాయిచి అధికారికంగా ప్రకటించారు. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాల్ కూలి ఇద్దరు దుర్మరణం.. పెరిగిన పేలుడు తీవ్రత జపాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ 'ఎన్‌హెచ్‌కే' (NHK) కథనం ప్రకారం.. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న కషీమా టౌన్‌లోని 'అయోన్ షాపింగ్ మాల్' (Aeon Shopping Mall) ఈ భూకంప ధాటికి ఒక్కసారిగా కుప్పకూలింది. మాల్ కూలిన సమయంలో లోపల ఉన్న వందలాది మంది వినియోగదారులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. కాగా, భూకంప ప్రకంపనల కారణంగా సదరు మాల్‌లోని గ్యాస్ పైప్‌లైన్ పగిలి భారీ పేలుడు సంభవించిందని, దీనివల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని స్థానిక పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతానికి మాల్ శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు.

రంగంలోకి ఎమర్జెన్సీ డిజాస్టర్ విభాగం.. భూకంపం వల్ల క్యూషు అంతటా ఊహించని రీతిలో భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రధాని సనాయి తకాయిచి నేతృత్వంలో ఉన్నత స్థాయి 'ఎమర్జెన్సీ డిజాస్టర్' (అత్యవసర విపత్తు నిర్వహణ) కార్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేశారు. ఈ విభాగానికి ప్రధానమంత్రి స్వయంగా అధిపతిగా వ్యవహరిస్తుండగా, కేబినెట్ మంత్రులందరూ ఇందులో సభ్యులుగా చేరారు.

తీవ్రమైన ఎండలు.. సహాయక చర్యలకు ఆటంకం భూకంప ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను చేపట్టింది. కూలిపోయిన విద్యుత్ గ్రిడ్‌లను పునరుద్ధరించడంతో పాటు, పైప్‌లైన్లు ధ్వంసమై తీవ్ర నీటి కొరత ఏర్పడిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, జపాన్‌లో ప్రస్తుతం ఒకవైపు భూకంప భయాందోళనలు ఉంటే.. మరోవైపు తీవ్రమైన ఎండల కారణంగా 'హీట్ స్ట్రోక్' (వడదెబ్బ) కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. ఈ ప్రతికూల వాతావరణం శిథిలాలను తొలగించే రెస్క్యూ ఆపరేషన్లకు తీవ్ర ఆటంకంగా మారినట్లు అధికారులు పేర్కొన్నారు.



## ఘనంగా డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ స్వర్గీయ డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సి. నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగు సాహిత్య రంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, తన కవిత్వం, రచనల ద్వారా తెలుగు భాషకు విశేషమైన కీర్తిని తీసుకువచ్చారని నాయకులు కొనియాడారు. స్వర్గీయ డాక్టర్ సి. నారాయణ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండూరి రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించిన లక్ష్మీకాంతారావు, సతీష్ కుమార్

బలగం టీవీ, హైదరాబాద్



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ బుధవారం నగరంలోని యశోద ఆసుపత్రిలో పరామర్శించారు. మూడు రోజుల క్రితం గుండెపోటు (హార్ట్ అటాక్) రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆసుపత్రికి వెళ్లిన నేతలు ఆయన ఆరోగ్య స్థితిగతులను, అందుతున్న చికిత్సను స్వయంగా పరిశీలించారు. అనంతరం సుదర్శన్ రెడ్డి భార్య పెద్ది స్వప్నతో పాటు అక్కడ ఉన్న ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తాము అన్ని విధాలా అండగా ఉంటామని వారికి మనోధైర్యాన్ని నింపారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ఉన్న నిశ్చల సంకల్పంతో ఆయన త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యశోద ఆసుపత్రి అటెండింగ్ వైద్య బృందంతో నేతలు ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అత్యంత మెరుగైన అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందించాలని వైద్యులను కోరారు.

# పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు!



**అమెరికా బలగాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల మెరుపుదాడి**

**ధాటికి ప్రతిధాటి: ఇరాన్ ఉగ్రశిబిరాలపై అమెరికా, సౌదీ సంయుక్త వైమానిక దాడులు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) లో నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. దౌత్యపరమైన చర్చల ద్వారా అమెరికా-ఇరాన్ మధ్య సమస్యను పరిష్కరించేందుకు అంతర్జాతీయ మధ్యవర్తులు ప్రయత్నిస్తున్న వేళ.. ఇరు దేశాలు మళ్లీ పరస్పర దాడులతో యుద్ధానికి దిగాయి. అమెరికా సైనిక బలగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో మెరుపుదాడికి పాల్పడింది. మంగళవారం సాయంత్రం 5:45 గంటల ప్రాంతంలో ఇరాన్ ఈ క్షిపణులను ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (CENTCOM) వెల్లడించింది. అయితే, ఇరాన్ ప్రయోగించిన అన్ని క్షిపణులను అమెరికా వైమానిక రక్షణ వ్యవస్థలు (ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్) గాల్లోనే విజయవంతంగా అడ్డుకుని కూల్చివేశాయని, తమ బలగాలు పూర్తి అప్రమత్తతతో సిద్ధంగా ఉన్నాయని సెంటకామ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది.

ఇరాన్ మిలీషియాపై అమెరికా-సౌదీ సంయుక్త దాడులు.. ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతీకారంగా అమెరికా, సౌదీ అరేబియా బలగాలు సంయుక్తంగా రంగంలోకి దిగాయి. టెహ్రాన్ మద్దతుతో నడుస్తున్న మిలీషియా గ్రూపులపై ఇరు దేశాల వాయుసేనలు విరుచుకుపడ్డాయి. తూర్పు ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద శిబిరాలు, ఆయుధ డిపోలు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. గత 72 గంటల్లో ఇరాన్ ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ఆధ్వర్యంలో 30కి పైగా డ్రోన్ దాడులు జరగగా, దానికి బలమైన సమాధానంగానే ఈ సంయుక్త వైమానిక దాడులు చేపట్టినట్లు అమెరికా స్పష్టం చేసింది. ఇరాన్, దాని అనుబంధ సంస్థలు ఈ దాడులను వెంటనే నిలిపివేయాలని హెచ్చరించింది.

మరోవైపు, తూర్పు సౌదీ అరేబియాలోని చమురు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని ఇరాక్ నుంచి ఇరాన్ అనుకూల మిలీషియాలు ప్రయోగించిన డ్రోన్లను వరుసగా రెండో రోజు కూడా అడ్డుకుని కూల్చివేసినట్లు సౌదీ అరేబియా తెలిపింది. ఈ పరిణామాలపై స్పందించిన ఇరాక్ ప్రధాని అలీ అల్-జైదీ.. తమ భూభాగంపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరపాలని దేశీయ భద్రతా సంస్థలను ఆదేశించారు.

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్ ఇరాన్ అభ్యర్థించడంతోనే తాము సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేశామని, ఒకవేళ కొత్త సీజ్‌ఫైర్ (కాల్పుల విరమణ) ఒప్పందం కుదరకపోతే దాడులు మళ్లీ తీవ్రమవుతాయని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అయితే ట్రంప్ వాదనలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికాతో ఎలాంటి చర్చలు జరిపే ప్రణాళికలు తమకు లేవని ఆ దేశ డిప్యూటీ విదేశాంగ □□ □□ కాజెమ్ గరీబాబాదీ కరాఖండిగా తేల్చి చెప్పారు. ఒమన్ మధ్యవర్తిత్వంతో చర్చల ప్రక్రియ నడుస్తున్నప్పటికీ, నిబంధనలను నిర్దేశించే హక్కు వాషింగ్టన్‌కు లేదన్నారు.

హర్మూజ్ జలసంధిపై తగ్గేదే లేదు.. ఇదే సమయంలో వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిపై (Strait of Hormuz) ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని గరీబాబాదీ స్పష్టం చేశారు. దక్షిణ షిప్పింగ్ మార్గాల భద్రతా బాధ్యత పూర్తిగా ఇరాన్ పరిధిలోనే ఉంటుందని, హర్మూజ్ జలసంధికి సమీపించే ఏ ఐరోపా (యూరప్) యుద్ధనౌక అయినా తమకు సులభమైన లక్ష్యంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. జలసంధిపై తమ నియంత్రణ జాతీయ రక్షణలో అంతర్భాగమని, యుద్ధం మళ్లీ మొదలైనా సరే వెనక్కి తగ్గేది లేదన్నారు.

20కి పైగా అమెరికా యుద్ధనౌకల మోహరింపు.. ఇరాన్ నుంచి ఎదురవుతున్న ముప్పు నేపథ్యంలో పశ్చిమాసియాలో అంతర్జాతీయ సముద్ర వాణిజ్య మార్గాల భద్రత కోసం అమెరికా తన మిలటరీ చర్యలను ముమ్మరం చేసింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు, నౌకాదళ దిగ్బంధనాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఏకంగా 20కి పైగా అమెరికా యుద్ధనౌకలను మోహరించినట్లు సెంటకామ్ వెల్లడించింది. సురక్షిత చర్యల్లో భాగంగా జులై 28 నాటికి 18 అంతర్జాతీయ వాణిజ్య నౌకల మార్గాన్ని మళ్లించామని, మరో 2 నౌకలను అదుపులోకి తీసుకుని తనిఖీ చేసినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది.

# వర్షాలతో రైతుల కళ్లలో ఆనందం నెలకొంది..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టివీ, రాజన్న సిరిసిల్ల :



వర్షాలతో రైతుల కళ్లలో ఆనందం నెలకొందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట, మల్లారం గ్రామాల్లో ఉదయం నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కా వాగు ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు పరిసర ప్రాంతాల్లో రైతులతో మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించడంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో వ్యవసాయ, సాగునీటి, ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.వరి సాగుకు నీటి కొరత ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని కందులు, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి గిరి ప్రదక్షిణ నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించామని చెప్పారు.అదేవిధంగా జూలై 30, 31 మరియు ఆగస్టు 1 తేదీల్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వరుణయాగాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నట్లు వెల్లడించారు.నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాలతో హన్మాజీపేట ప్రాంతంలోని నక్కా వాగు ఉధృతంగా ప్రవహించడం రైతుల్లో కొత్త ఆశలు నింపిందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నిరాశ చెందిన రైతులు ఇప్పుడు మిగిలిన భూముల్లోనూ దున్ని వరి నాట్లు వేస్తున్నారని తెలిపారు. వర్షాలు రావడంతో పంటలపై మళ్లీ ఆశలు చిగురించాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బ్యారేజీలు, ప్రాజెక్టులు నిండిపోయి భూగర్భ జలాలు పెరగాలని, రైతులకు సమృద్ధిగా సాగునీరు అందాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలపాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

విద్యారంగంలో జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలిపేలా అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

పీజీఐ (పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్) తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,జిల్లా విద్యాధికారి మొండయ్య, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి 15 రోజులోకసారి అన్ని పాఠశాల ప్రధానోపాధ్యా యులు, మండల విద్యాధికారులతో మండలాల వారిగా సమావేశం నిర్వహించి నాణ్యమైన విద్య తో పాటు, పాఠశాల మౌలిక వసతులు విద్యార్థులకు అనుకూలంగా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు.

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్తి అంకిత భావంతో పని చేసి జిల్లాను అత్యుత్తమ స్థాయిలో జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలపాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, కో ఆర్డినేటర్లు సతీష్, పద్మజ తదితరులు ఉన్నారు.



## కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గిరి ప్రదక్షిణలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది..

బలగం టీవీ, కొండగట్టు:

గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణలో మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్ లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పొలాలు పచ్చగా కళకళలాడాలని, పంటలు సమృద్ధిగా పండాలని, తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



## నీటి లభ్యత చూసుకుని పంటల సాగుచేసుకోవాలి



బలగంటీవీ,బోయినిపల్లి;

ప్రస్తుతం పడుతున్న వర్షాలను చూసి వరీ పంట వేసుకోవద్దని, ఇంకా 3-4 నెలల కాలం నీటి లభ్యత చూసుకుని మాత్రమే పంటలను సాగుచేసుకోవాలని, ఈ రోజు ఎలాగోలా నాటు వేసుకుని పంట పొట్ట దశలో బావిలో నీరు లేక ఎండిపోతే ఎకరానికి 30-40 వేలు నష్టం వాటిల్లే ముప్పు ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయనిపల్లి మండలం రత్నంపేట, అనంతపల్లి,తడగొండ గ్రామలలో బుధవారం రోజున రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తహశీల్దార్ మాట్లాడుతూ: బోర్వెల్ ఉన్న ప్రతి ఒక్క సన్న, చిన్నకారు రైతు బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాన్ని చేసుకోనీ, నీటిని ఆదా చేసుకోవాలని సూచించారు. ఏవో మాట్లాడుతూ: రైతులు తమ మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించడం జరిగింది.తక్కువ నీటితో సాగు చేయగల కంది, పొద్దు తిరుగుడు, ఆముదం పంటలని ఆగస్టు 15 వరకు వేసుకోవచ్చు , ఆగస్టు 15 నుండి నువ్వు పంట వేసుకోవచ్చని తెలిపారు.

ఏపీవో సబిత మాట్లాడుతూ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వానచినుకుని సంరక్షించుకుంటే నే ప్రయోజనం ఉంటుంది కనుక వీబీజి రామ్ పథకం కింద రైతులు తమ బోర్ల చుట్టూ రీచార్జ్ గుంతలను తవ్వుకోవాలని, దీనికి అయ్యే ఖర్చు సుమారు 36000/- ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం రాయితీపై అందచేస్తుందని తెలిపారు.పంట కుంటలు వరద నీటిని నిల్వ చేసుకోవడానికి ఒక గుంట స్థలం లో 72000/- రూపాయలతో 100 శాతం రాయితీ పై నిర్మించుకోవచ్చని, ప్రభుత్వ భూముల్లో, కొండ ప్రాంతాల్లో ఊరకుంట నిర్మాణాలు, ఇంటి నుండి వచ్చే మురుగు నీటిని ఆదా చేసుకోవడానికి ఇంకుడు గుంత 6,700 రూపాయల తో వీబీ జి రామ్ పథకం కింద నిర్మించుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కౌడగని వెంకటేష్, గంగాధర కావ్య, ఉయ్యాల శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి శరత్ బాబు, తహశీల్దార్ జలీల్ మొహియుద్దీన్, వ్యవసాయ అధికారి ప్రణీత, ఏపీవో సబిత, ఏ ఈ ఓ లక్ష్మణ్, హరీష్, రవళి, ఏఈఈ ఇరిగేషన్ మహేంద్ర, పంచాయతీ కార్యదర్శి సరిత, రాజశేకర్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వార్డు ఇన్‌చార్జి నియామక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర దేవరాజు అధ్యక్షత వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ హాజరై పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని నూతన వార్డు ఇన్‌చార్జికి సూచించారు. అనంతరం 14వ వార్డుకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర దేవరాజు, వార్డు కౌన్సిలర్ వెంగళ లీల లక్ష్మీనర్సు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.



# రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆగస్టు నెల సదరం శిబిరాలు..

**– దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆగస్టు-2026 నెలలో సదరం శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. దివ్యాంగుల గుర్తింపు, వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో భాగంగా కంటిచూపు, వినికిడి, ఆర్థోపెడిక్, మానసిక మరియు జనరల్ వైకల్యాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్ణీత తేదీలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సంబంధిత వైద్య నిపుణులు సూచించిన తేదీల ప్రకారం నిర్వహించే సదరం శిబిరాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

| క్రమసంఖ్య | క్యాంపు తేది | విభాగము |
|---|---|---|
| 03.08.2026 | (సోమవారం) | ఆర్థో - 60 |
| 03.08.2026 | (సోమవారం) | కంటిచూపు – 30 |
| 04.08.2026 | (మంగళవారం) | ఆర్థో - 60 |
| 05.08.2026 | (బుధవారం) | ఆర్థో - 60 |
| 05.08.2026 | (బుధవారం) | వినికిడి -45 |
| 06.08.2026 | (గురువారం) | ఆర్థో - 65 |
| 06.08.2026 | (గురువారం) | వినికిడి -44 |
| 07.08.2026 | (శుక్రవారం) | కంటిచూపు – 30 |
| 12.08.2026 | (బుధవారం) | జనరల్ - 30 |
| 17.08.2026 | ( సోమవారం) | కంటిచూపు – 30 |
| 21.08.2026 | (శుక్రవారం) | మానసిక –30 |
| 22.08.2026 | (శనివారం) | మానసిక –31 |

పైన తెలిపిన తేదిలలో ఈ సదరం శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు తప్పనిసరిగా సంబంధిత




మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్-రేలు (అవసరమైతే), UDID అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో మరియు ఫోన్ నంబర్ వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.

అర్హులైన దివ్యాంగులు నిర్ణీత తేదీలలో ఉదయం 9.00 గంటలకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రాజన్న సిరిసిల్లలో జరిగే సదరం శిబిరాలకు హాజరై సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సమాచారాన్ని మండల అభివృద్ధి అధికారులు, సిరిసిల్ల మరియు వేములవాడ మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని దివ్యాంగులకు తెలియజేసి, శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు.

# సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి..



**- జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న బోనాల సబ్ సెంటర్‌లో బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమం ను జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా టీకా సెషన్ నిర్వహణ, వ్యాక్సిన్ నిల్వ, కోల్డ్ చైన్ నిర్వహణ, లబ్ధిదారుల నమోదు, టీకాల వినియోగం, మదర్ & చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి గర్భిణి, శిశువు, చిన్నారికి జాతీయ టీకా షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.గ్రామస్థాయిలో టీకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, టీకాలకు గైర్హాజరైన లబ్ధిదారులను గుర్తించి వారికి వెంటనే టీకాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టీకా సెషన్లలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సంపత్‌కుమార్, విసిసిఎం నవీన, ఏఎన్ఎంలు, సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల అంటే కేటీఆర్.. కేటీఆర్ అంటే సిరిసిల్ల

## ఈ బంధాన్ని ఎవరూ విడదీయలేరు..

**-కేటీఆర్ , సిరిసిల్లది.. తల్లి కొడుకుల బంధం.. బీఆర్ఎస్ నేతలు**

**-ఎవ్వరు ఎన్ని కుట్రలు పన్నినా విడదీయలేరు..**

**- బిఆర్ఎస్ నేతలు చిలివెరి చిరంజీవి, మెంగని మనోహర్..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

కేటీఆర్‌కు సిరిసిల్ల ప్రజలతో తల్లి కొడుకుల అనుబంధం ఉందని, ఎన్ని కుట్రలు పన్నినా ఈ బంధాన్ని ఎవరూ విడదీయలేరని బీఆర్ఎస్ నాయకులు చిలివేరి చిరంజీవి, మెంగని మనోహర్ అన్నారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ "సిరిసిల్ల అంటే కేటీఆర్.. కేటీఆర్ అంటే సిరిసిల్ల" అని స్పష్టం చేశారు.

యువతలో కేటీఆర్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని వారు విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వడం మానుకోవాలని హితవు పలికారు.

నీట్ ప్రశ్నపత్రాల లీకేజీతో విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడిందని ఆరోపించారు. విద్యార్థులకు సంఘీభావంగా తన జన్మదిన వేడుకలను సైతం కేటీఆర్ త్యాగం చేశారని, యువత సమస్యలపై పోరాడుతున్న నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. విద్యార్థుల ఆందోళనలపై లాఠీచార్జ్ చేసి దమనకాండకు పాల్పడింది బీజేపీ ప్రభుత్వమేనని మండిపడ్డారు.

సిరిసిల్ల అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలను ప్రజలు గుర్తించాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. పదేళ్ల క్రితం సిరిసిల్ల పరిస్థితి, ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని




సూచించారు.

బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు స్పందిస్తూ, "మీరు చేసిన అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించాల్సింది మేమే. మీ నాయకుల ఇళ్లను ముట్టడించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటిది మీరు ముట్టడులకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు.

బండి సంజయ్ కుమారుడిపై గతంలో నమోదైన పోక్సో కేసును ప్రస్తావిస్తూ, రాజీనామా డిమాండ్ చేయాల్సింది తామేనని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై బీజేపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాట్ల మధుపై విమర్శలు చేసే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదని అన్నారు. రెండు సార్లు జిల్లెల్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, ఒకసారి జనరల్ స్థానంలో సర్పంచ్‌గా గెలిచిన మధు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు ప్రజలకు తెలుసని చెప్పారు.

అగ్రికల్చర్ కాలేజీ భూములు కోల్పోయిన నిర్వాసితులకు, ఏళ్ల తరబడి కబ్జాల్లో ఉన్న దళితులకు కేటీఆర్ సహకారంతో పట్టాలు ఇప్పించడంలో మధు కీలక పాత్ర పోషించారని, ప్రజలకు అండగా నిలిచిన నాయకుడని కొనియాడారు. కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు, అవాకులు-చవాకులు చేస్తే సహించేది లేదని గులాబీ నాయకులు బీజేపీ నేతలను హెచ్చరించారు. ప్రజా సమస్యలపై చర్చకు రావాలని, రాజకీయ ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు.

# డాక్టర్ సినారేకు రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఘన నివాళి..




**బలగం టీవీ,రాజన్నసిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారే) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా పూర్వ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, విశిష్ట అతిథిగా ఎనుగుల ఎల్లయ్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ, తెలంగాణ తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి తెలుగు కవిత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణలోని హనుమాజిపేట ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటిన మహాకవి సినారేనని పేర్కొంటూ ఆయనకు అంకితంగా రెండు పద్యాలను ఆలపించారు. సినారే సాహిత్యం ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ మాట్లాడుతూ, సినారే తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా తెలంగాణ కవులకు మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన సాహిత్య స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సహాధ్యక్షులు కోడం నారాయణ సినారేపై తాను రచించిన కవితను చదివి వినిపించారు. ఉపాధ్యక్షులు బూర దేవానందం గజల్‌ను ఆలపించగా, ముడారి సాయి మహేష్, గుండెల్ని వంశీ తమ కవితలను వినిపించి సభికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో దొంత దేవదాసు, ఎనుగుల ఎల్లయ్యతో పాటు పలువురు కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొని మహాకవి సినారేకు ఘనంగా నివాళులర్పించారు.



## భూములను రీసర్వే చేయుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీ..

**- ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకట్ల సురేష్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం భూముల విషయం లో రీ సర్వే చేయుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకాట్ల సురేష్ తెలిపారు. మండలంలోని సిరికొండ గ్రామం మొదట ఎంపిక కాబడిందాన్నారు. ఈ సందర్భంగా సిరికొండ గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించడం జరిగిందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి, సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఐఐటీ విద్యార్థికి కేటీఆర్ భరోసా..!

**- ల్యాప్ టాప్ అందించి.. కళాశాల ఫీజు సైతం చెల్లిస్తా అని హామీ..**

**- కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి అభినవ్, తల్లిదండ్రులు..**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సోమవారం ఐఐటీ లో వారణాసి లో సీటు సాధించిన సిరిసిల్ల కు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలత లతో కలిసి హైదరాబాద్ లో కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేత కుటుంబానికి చెందిన అభినవ్ ను ఐఐటి లో సీటు సాధించడంతో కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థికి ల్యాప్ టాప్ ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తాను చెల్లిస్తానని భరోసా ఇచ్చి, చక్కగా చదువుకొని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు విద్యార్థి అభినవ్, తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ శ్రీలతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిరిసిల్ల పద్మశాలి సంఘం నేతలు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) నివాసంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు మార్కండేయ చిత్రపటాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

అనంతరం సిరిసిల్ల పద్మశాలి సంఘానికి సంబంధించిన సమస్యలు, సామాజిక వర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలు, ఇతర ప్రజా సమస్యలను నాయకులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను శ్రద్ధగా విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, పద్మశాలి సంఘానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఓపికగా ఆలకించి, సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన కేటీఆర్‌కు సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, మండల సత్యం, గాజుల బాలయ్య, గెంట్యాల శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.



## తెలుగు సాహిత్య శిఖరాలను అధిరోహించిన మహాకవి సినారె

**రచయితల సంఘం నాయకులు..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలుగు సాహిత్యాన్ని, చలనచిత్ర రంగాన్ని తన అమృతమయమైన కవిత్వంతో, గజల్లతో, వేలాది భావోద్వేగభరిత సినీ గీతాలతో విశిష్ట శిఖరాలకు చేర్చిన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) తెలుగు జాతికి గర్వకారణమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి, మానేరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్ పేర్కొన్నారు.

బుధవారం సిరిసిల్ల గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా హనుమాజీపేటలో 1931 జూలై 29న జన్మించిన సినారె తెలుగు సాహిత్యానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన మహాకవి అని కొనియాడారు. అనేక కావ్య గ్రంథాలను రచించిన సినారె, తన విశ్వంభర కావ్య సంపుటికి జ్ఞానపీఠ్ అవార్డును అందుకోవడం తెలుగు సాహిత్యానికి దక్కిన అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు. మన జిల్లాకు చెందిన మహాకవి దేశవ్యాప్తంగా తెలుగు భాషకు, సాహిత్యానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా, ఉపకులపతిగా సేవలందించిన సినారె, అనంతరం రాజ్యసభ సభ్యుడిగా కూడా విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన కవిత్వం మానవీయ విలువలకు ప్రతిబింబమని, సినీ గీతాలు తెలుగు భాష సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయని పేర్కొన్నారు. తరతరాలకు ఆయన రచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మైలారం తిరుపతి, ఉపాధ్యాయులు రాజలింగం, సతీష్‌బాబు, జయంతి, అర్చన, వైదేహి, కే. మంజుల, రేణుక, స్వప్న, వసంత, రమణాదేవి, విమోచన, టీ. మంజుల తదితరులు పాల్గొన్నారు.

# గంభీర్‌ను నిలదీయండి



### కైఫ్ సంచలన వ్యాఖ్యలు
### కుల్దీప్ యాదవ్‌కు అన్యాయం చేశారు: బీసీసీఐకి మాజీ క్రికెటర్ సూచన**

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఇంగ్లండ్ పర్యటనలో వరల్డ్ క్లాస్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను, టీమ్ మేనేజ్‌మెంట్‌ను బీసీసీఐ (BCCI) గట్టిగా నిలదీయాలని కోరాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత జట్టు పేలవ ప్రదర్శనతో వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో.. త్వరలోనే ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం (రివ్యూ మీటింగ్) జరగనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ భేటీలో వరుస ఓటములకు గల కారణాలతో పాటు రాబోయే సిరీస్‌ల వ్యూహాలపై చర్చించనున్నారు.

**అంత అనుభవం ఉన్నా పక్కనబెడతారా?**

ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో కుల్దీప్ యాదవ్‌కు ఒక్క మ్యాచ్‌లో కూడా అవకాశం ఇవ్వకపోవడాన్ని కైఫ్ తప్పుపట్టాడు. లార్డ్స్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయాలతో దూరమైనా.. కుల్దీప్‌ను ఆడించకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏంటని ప్రశ్నించాడు. "రివ్యూ మీటింగ్‌లో బీసీసీఐ తప్పకుండా తుది జట్టు ఎంపికపై గంభీర్‌ను ప్రశ్నించాలి. బుమ్రా, సుందర్, వరుణ్ లేని సమయంలో కూడా కుల్దీప్‌ను కాదని అనుభవం లేని బౌలర్లను ఆడించడం నా ఊహకు కూడా అందడం లేదు. ఇంతకంటే చెత్త మేనేజ్‌మెంట్‌ను నేను ఎప్పుడూ చూడలేదు" అని కైఫ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

**బట్లర్‌పై మంచి రికార్డు ఉన్నా..**

గతంలో ఇంగ్లండ్ గడ్డపై కుల్దీప్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడని కైఫ్ గుర్తు చేశాడు. ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ చివర్లో వేగంగా 40 పరుగులు చేయడంతోనే ఇంగ్లండ్ 387 పరుగుల భారీ స్కోరు సాధించి విజయాన్నందుకుంది. బట్లర్‌పై కుల్దీప్‌కు ఎంతో మంచి రికార్డు ఉందని, బ్యాటింగ్ డెప్త్ కోసం అతడిని పక్కనబెట్టామని మేనేజ్‌మెంట్ సమర్థించుకోవచ్చని, కానీ నెంబర్ 8 బ్యాటర్ గాయపడినప్పుడు కూడా కుల్దీప్‌ను తీసుకోకపోవడం పెద్ద పొరపాటని విశ్లేషించాడు.

**2027 ప్రపంచకప్‌కు బౌలింగే పెద్ద సమస్య!**

రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌కు ముందు టీమిండియాను వేధిస్తున్న అతిపెద్ద సమస్య బౌలింగేనని కైఫ్ హెచ్చరించాడు. "బ్యాటింగ్‌లో కోహ్లీ, రోహిత్ శర్మ గురించి ఎలాంటి ఆందోళన లేదు. కానీ సౌతాఫ్రికా పిచ్‌లపై బౌలింగ్ చేయడమే అసలైన సవాల్. అక్కడ 250 లోపు తక్కువ స్కోర్లే నమోదవుతాయి. అలాంటి లక్ష్యాలను కాపాడుకునే నాణ్యమైన బౌలింగ్ ప్రస్తుతం మన దగ్గర లేదు. బుమ్రా, హార్దిక్ పాండ్యాలకు ప్రత్యామ్నాయ బౌలర్లు కరువయ్యారు. గతంలో లాగా మహమ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్ వంటి స్వింగ్ బౌలర్లు లేరు. కొత్త ఆటగాళ్లకు వరుస అవకాశాలు ఇస్తున్నప్పుడు, మహమ్మద్ సిరాజ్‌ను ఎందుకు పక్కన పెడుతున్నారో కూడా అర్థం కావడం లేదు" అని కైఫ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలవాలంటే బ్యాటింగ్, బౌలింగ్ సమతుల్యంగా ఉండాలని బోర్డుకు సూచించాడు.

# సారాంశ్ జైన్ అద్భుత బౌలర్.. అతనికి సత్తా ఉంది!

### టీమిండియా కొత్త స్పిన్నర్‌పై రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు**
### టెస్టుల్లో వాషింగ్టన్ సుందర్ పాత్ర ఏంటో తేల్చాలి.. టీమ్ మేనేజ్‌మెంట్‌కు కీలక సూచన**

బలగం టీవీ, హైదరాబాద్



శ్రీలంకతో జరగబోయే రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టులోకి ఎంపికైన మధ్యప్రదేశ్ ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్‌పై టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. సారాంశ్ అద్భుతమైన బౌలర్ అని, 33 ఏళ్ల వయసులో అతనికి టెస్ట్ టీమ్‌లో చోటు దక్కడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నాడు. గాయపడిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో సెలెక్టర్లు సారాంశ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. కాగా, మురళీ విజయ్, మహమ్మద్ షమీల తర్వాత ఐపీఎల్ కాంట్రాక్ట్ లేకుండానే భారత టెస్టు జట్టుకు ఎంపికైన మూడో ఆటగాడిగా సారాంశ్ జైన్ అరుదైన రికార్డు సృష్టించాడు.

**విభిన్నమైన ఆఫ్ స్పిన్నర్: అశ్విన్**

తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా సారాంశ్ జైన్ గురించి అశ్విన్ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. "సారాంశ్ జైన్‌కు టీమిండియాలో చోటు దక్కడం అభినందనీయం. అతని బౌలింగ్‌ను నేను నిశితంగా గమనించాను. క్రీజ్‌కు కాస్త దూరంగా నిలబడి బౌలింగ్ చేస్తూ బ్యాటర్లపై నిరంతరం అటాకింగ్ చేయడం అతని శైలి. వికెట్లు తీయడమే పనిగా పెట్టుకునే ఒక విభిన్నమైన ఆఫ్ స్పిన్నర్ అతను. ఇటీవల దేశీవాళీ టోర్నీల్లో, ఇండియా-ఎ తరఫున అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అతనికి జాతీయ జట్టులో అవకాశం వస్తుందని నేను ముందే ఊహించాను" అని అశ్విన్ కొనియాడాడు.

అయితే, జట్టులో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ వంటి సీనియర్లు ఉండటం వల్ల సారాంశ్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందా? లేదా? అనేది చూడాలని, కానీ భారత్ తరఫున రాణించగల సత్తా ఉన్న అతనికి ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు అశ్విన్ తెలిపాడు.

**సుందర్ రోల్ ఏంటో స్పష్టం చేయాలి..**

ఇదే సమయంలో గాయంతో దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గురించి అశ్విన్ మాట్లాడుతూ టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఒక కీలక సూచన చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో సుందర్ పాత్ర ఏంటో మేనేజ్‌మెంట్ స్పష్టంగా తేల్చాలని డిమాండ్ చేశాడు. "వాషింగ్టన్ సుందర్ అద్భుతమైన బ్యాటర్, అలాగే మ్యాచ్‌లు గెలిపించగల మంచి స్పిన్నర్. కానీ, మేనేజ్‌మెంట్ అతని ప్రాథమిక పాత్ర ఏంటో నిర్ణయించి అతనికి చెప్పాలి. అతను టాప్-6 లో వచ్చే బ్యాటరా? లేక టాప్-4 లో ఉండే ప్రధాన బౌలరా? నేనైతే అతన్ని టాప్-6 లో బ్యాటింగ్ చేయించాలని చెబుతాను. ఒకవేళ భారత్ మ్యాచ్ ఓడిపోతే, సుందర్ బ్యాటరా? బౌలరా? అంటూ అతనిపై విమర్శలు వస్తాయి. అలా జరగకుండా ఉండాలంటే అతని పాత్రను ముందుగానే ఖరారు చేయడం చాలా ముఖ్యం" అని అశ్విన్ స్పష్టం చేశాడు.



# వెయిట్‌లిఫ్టింగ్‌లో హర్జిందర్ కౌర్‌కు రజతం

బలగం టీవీ, హైదరాబాద్

వెయిట్‌లిఫ్టింగ్‌లో హర్జిందర్ కౌర్ భారత్‌కు మరో రజత పతకాన్ని అందించారు. మహిళల 69 కేజీల విభాగంలో పోటీపడిన హర్జిందర్, తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మొత్తం 227 కేజీల బరువును విజయవంతంగా ఎత్తారు. ఈ విభాగంలో కెనడాకు చెందిన షార్లెట్ సిమోనో మొత్తం 235 కేజీలతో స్వర్ణం సాధించగా, హర్జిందర్ రెండో స్థానంలో నిలిచారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం గెలుచుకున్న హర్జిందర్‌కు కామన్వెల్త్ క్రీడల్లో ఇది వరుసగా రెండో పతకం. దేశానికి పతకం అందించడం తనకు ఎంతో గర్వంగా ఉందని హర్జిందర్ కౌర్ అన్నారు. అంతే కాకుండా ఈ విజయాన్ని తన కుటుంబానికి అంకితం ఇస్తున్నట్లు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

"భారత్ తరఫున రజత పతకం గెలవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణంలో ఎంతో గర్వంగా భావిస్తున్నాను. నా ప్రదర్శన పట్ల నాకు పూర్తి సంతృప్తిగా ఉంది. ఈ పతకాన్ని నా కుటుంబానికి అంకితం చేస్తున్నాను. మేము ఇక్కడి వరకు వచ్చి దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి, పతకాలు సాధించడానికి పూర్తి సహకారం అందించిన ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు, భారత ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు"

- హర్జిందర్ కౌర్,

భారత్ పతకాల సంఖ్య 12

గుల్వీర్, హర్జిందర్ సాధించిన రజతాలతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత పతకాల పట్టిక మెరుగైంది. భారత్ ఖాతాలో ప్రస్తుతం 2 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలతో మొత్తం 12 పతకాలు చేరాయి. వెయిట్‌లిఫ్టింగ్‌లో స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించగా, పారా అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో షర్మిలా ధంకర్ రెండో పతకంతో సత్తా చాటారు. హైజంప్‌లో సర్వేష్ కుషారే రజతంతో మెరవగా, ట్రాక్‌పై గుల్వీర్ సింగ్ నమోదు చేసిన చారిత్రాత్మక రజతం భారత క్రీడా చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది.

# గుల్వీర్ సింగ్ చారిత్రాత్మక రజతం!

### కామన్వెల్త్ గేమ్స్: 10 వేల మీటర్ల పరుగులో పతకం సాధించిన తొలి భారతీయుడిగా సరికొత్త రికార్డు
### హైజంప్‌లో మెరిసిన సర్వేష్ కుషేర్.. మహిళల విభాగంలో పూజా సింగ్‌కు నిరాశ




బలగం టీవీ, గ్లాస్గో

కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. మెగా ఈవెంట్‌లో భాగంగా జరిగిన పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో గుల్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని (సిల్వర్ మెడల్) కైవసం చేసుకున్నాడు. కామన్వెల్త్ క్రీడల చరిత్రలోనే ఈ సుదీర్ఘ పరుగు విభాగంలో పతకం సాధించిన మొట్టమొదటి భారతీయ అథ్లెట్‌గా గుల్వీర్ రికార్డులకెక్కాడు. ఇప్పటికే జాతీయ రికార్డు హోల్డర్‌గా ఉన్న గుల్వీర్.. ప్రస్తుత కామన్వెల్త్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో భారతదేశానికి రెండో రజతాన్ని అందించాడు. ఇదే మెగా ఈవెంట్ పురుషుల హైజంప్ కేటగిరీలో భారత అథ్లెట్ సర్వేష్ కుషేర్ కూడా సిల్వర్ మెడల్ గెలుచుకొని మెరిశాడు.

భారీ వర్షంలోనూ రికార్డు పరుగు.. గ్లాస్గోలోని స్కాట్‌స్టోన్ స్టేడియంలో బుధవారం భారీ వర్షం కురుస్తుండగా ఈ రేస్‌ను నిర్వహించారు. ప్రతికూల వాతావరణం, తడిసిన ట్రాక్‌పై కూడా 28 ఏళ్ల గుల్వీర్ సింగ్ తన చాకచక్యాన్ని ప్రదర్శించాడు. ఆఫ్రికన్ రన్నర్ల నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, ఆరంభం నుంచే లీడింగ్‌లో ఉంటూ చివరి ల్యాప్‌లో చిరుతలా దూసుకెళ్లాడు. గుల్వీర్ సింగ్ 27 నిమిషాల 49.78 సెకన్లలో 10 వేల మీటర్ల పరుగును ముగించి రెండో స్థానంలో నిలిచాడు. కాగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కై రాబిన్‌సన్ 27:48.93 సెకన్ల స్వల్ప సమయంతో అగ్రస్థానాన్ని దక్కించుకొని స్వర్ణ పతకాన్ని ఎగురేసుకుపోయాడు. ఈ ఈవెంట్‌లో 1986 కామన్వెల్త్ క్రీడల తర్వాత తొలిసారిగా విజేతల పోడియంపై ఒక్క ఆఫ్రికా అథ్లెట్ కూడా కనిపించకపోవడం గమనార్హం.

శ్రమను మరిపించిన మెడల్: గుల్వీర్ ఉత్తరప్రదేశ్‌లోని ఆత్రౌలీకి చెందిన గుల్వీర్ సింగ్ ప్రస్తుతం భారత ఆర్మీలో సేవలు అందిస్తున్నాడు. అమెరికాకు చెందిన ప్రముఖ కోచ్ స్కాట్ సిమ్మన్స్ పర్యవేక్షణలో అతడు శిక్షణ పొందుతున్నాడు. రేస్ ముగిసిన అనంతరం ఆసియా ఛాంపియన్ గుల్వీర్ మాట్లాడుతూ.. "మెడల్ గెలవడం ఎప్పుడూ ఎనలేని సంతోషాన్ని ఇస్తుంది. భారీ వర్షం ఉన్నా పతకం గెలవడంతో ఆ కష్టాలన్నీ మరిచిపోయాను. మైదానంలోకి దిగాక ఎండ, వాన, వేడి ఏవీ గుర్తుకు రావు. అంతా భగవంతుడిపైనే వదిలేసి పరిగెత్తాను. నా తదుపరి ఫోకస్ అంతా 5 కే (5,000 మీటర్లు) రన్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. కాగా, ఈ విజయం గురించి తన కుటుంబ సభ్యులకు ఇంకా సమాచారం అందించలేదని చెప్పాడు.

పూజా సింగ్‌కు తప్పని నిరాశ.. మరోవైపు మహిళల హైజంప్ విభాగంలో భారతదేశానికి నిరాశే ఎదురైంది. ఆసియా ఛాంపియన్, 19 ఏళ్ల పూజా సింగ్ ఈ టోర్నీ నుంచి దురదృష్టవశాత్తూ నిష్క్రమించింది. స్టేడియంలో కురిసిన భారీ వర్షం కారణంగా రన్-అప్‌లో ఇబ్బంది పడిన పూజ.. కనీసం 1.82 మీటర్ల ఎత్తును కూడా క్లియర్ చేయలేకపోయి పతక రేసు నుండి తప్పుకుంది.

# నెయ్‌మార్ రిటైర్మెంట్.. ఫుట్‌బాల్ ప్రపంచం దిగ్భ్రాంతి!**

### **బ్రెజిల్ జాతీయ జట్టుకు వీడ్కోలు పలికిన స్టార్ స్ట్రైకర్**
### **16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ఎండ్ కార్డ్.. 80 గోల్స్‌తో బ్రెజిల్ ఆల్‌టైమ్ టాప్ స్కోరర్‌గా రికార్డు**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, బ్రెజిల్ స్టార్ ప్లేయర్ నెయ్‌మార్ జూనియర్ (34) అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. బ్రెజిల్ జాతీయ జట్టు తరఫున సుదీర్ఘంగా సాగిన తన 16 ఏళ్ల సంచలన కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు బుధవారం అతడు అధికారికంగా వెల్లడించాడు. బ్రెజిల్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పిన నెయ్‌మార్.. ఈ నిర్ణయం తీసుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అతని అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

**వరల్డ్ కప్ వైఫల్యమే కారణమా?**

ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా (FIFA) వరల్డ్ కప్-2026 టోర్నీలో బ్రెజిల్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. లీగ్ దశలో జరిగిన కీలక మ్యాచ్‌లో నార్వే చేతిలో 2-1 తేడాతో బ్రెజిల్ పరాజయం పాలై, టోర్నీ నుండి అర్ధాంతరంగా నిష్క్రమించింది.



జట్టు ఘోర వైఫల్యం, వరల్డ్ కప్ రేసు నుండి నిష్క్రమించిన కొద్ది రోజుల్లోనే నెయ్‌మార్ జాతీయ జట్టుకు గుడ్‌బై చెప్పడం గమనార్హం.

**ఇక ఆ పసుపు రంగు జెర్సీని ధరించను..**

తన రిటైర్మెంట్ సందర్భంగా నెయ్‌మార్ భావోద్వేగానికి లోనయ్యాడు. "ఇంతకాలం నా దేశం తరఫున మైదానంలో ఎంతో చెమటోడ్చాను. బ్రెజిల్ సంప్రదాయ పసుపు రంగు జెర్సీ వేసుకొని ప్రతి మ్యాచ్‌లోనూ శాయశక్తులా పోరాడాను. నా జీవితంలో ఇదొక అద్భుతమైన ప్రయాణం. కానీ, ఇకపై నేను ఆ పసుపు రంగు జెర్సీని ధరించను" అని నెయ్‌మార్ భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు. తన కెరీర్‌లో ఫుట్‌బాల్ ప్రపంచకప్‌తో పాటు కోపా అమెరికా, ఒలింపిక్స్‌లలో బ్రెజిల్‌కు ప్రాతినిధ్యం వహించి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించానని గుర్తుచేసుకున్నాడు.

**వివాదాల నేపథ్యంలో ప్రకటన..**

ఇటీవల జరిగిన కోపా సుడామెరికానా టోర్నీలో శాంటోస్ క్లబ్ తరఫున ఆడిన మ్యాచ్‌లో యూనివర్సిడాడ్ సెంట్రల్ జట్టుపై 4-2 తేడాతో విజయం సాధించిన తర్వాత నెయ్‌మార్‌పై కొన్ని ఆరోపణలు వచ్చాయి. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో నెయ్‌మార్ సహచర యువ ఆటగాళ్లను వెక్కిరించి, బెదిరించాడని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను అతడు తీవ్రంగా ఖండించాడు. ఈ వివాదాల నేపథ్యంలోనే జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్ ప్రకటిస్తున్నట్లు బుధవారం స్పష్టం చేశాడు.

# ర్యాంకింగ్స్‌లో వైభవ్ రాకెట్ స్పీడ్!

### ఏకంగా 230 స్థానాలు ఎగబాకి టాప్-50 లోకి చేరిన టీమిండియా కుర్రాడు
### అగ్రస్థానంలోనే ఇషాన్ కిషన్.. అభిషేక్ శర్మకు ఎదురుదెబ్బ, మూడో స్థానానికి పతనం





బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రికెట్ సరికొత్త సంచలనం, యంగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) తాజాగా ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. జింబాబ్వే పర్యటనలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఈ 15 ఏళ్ల చిచ్చరపిడుగు ఏకంగా 230 స్థానాలను దాటుకుంటూ రాకెట్‌లా టాప్-50 లోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం వైభవ్ 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు, టీమిండియా యంగ్ సెన్సేషన్ ఇషాన్ కిషన్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకోగా.. జింబాబ్వే టోర్నీలో విఫలమైన ఓపెనర్ అభిషేక్ శర్మ ఒక స్థానాన్ని కోల్పోయి మూడో ప్లేస్‌కు పడిపోయాడు.

278వ ర్యాంక్ నుండి టాప్-50 లోకి.. ఈ నెల 4న ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ.. ఆరంభంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఆ సిరీస్ ముగిసేసరికి అతడు 278వ ర్యాంకులో నిలిచాడు. అయితే, ఇటీవల ముగిసిన జింబాబ్వే పర్యటనలో మాత్రం వైభవ్ చెలరేగిపోయాడు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండు కీలక అర్ధశతకాలతో (హాఫ్ సెంచరీలు) దుమ్మురేపాడు. మొత్తం 50.33 సగటుతో 151 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సైతం కైవసం చేసుకున్నాడు. ఈ మెరుగైన ప్రదర్శనతోనే తాజా ర్యాంకింగ్స్‌లో 48వ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు.

అభిషేక్ తీవ్ర నిరాశ.. పుంజుకున్న తిలక్ వర్మ జింబాబ్వే పర్యటనలో భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ సింగిల్ డిజిట్‌కే పరిమితమై కేవలం 11 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ పేలవ ప్రదర్శన ప్రభావం అతని ర్యాంకింగ్‌పై పడింది. ఒక స్థానాన్ని కోల్పోయిన అభిషేక్ ప్రస్తుతం 819 రేటింగ్స్‌తో మూడో స్థానానికి పడిపోయాడు.

మరోవైపు భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో ఒక హాఫ్ సెంచరీతో కలిపి 77 పరుగులు చేసిన తిలక్.. రెండు స్థానాలు ఎగబాకి ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్‌లను అధిగమించి 750 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచాడు. కాగా, జింబాబ్వే సిరీస్‌లో 145 పరుగులు చేసిన ఇషాన్ కిషన్ 910 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు.

ఐసీసీ టాప్-5 టీ20 బ్యాటర్లు వీరే:

ఇషాన్ కిషన్ (భారత్) – 910 రేటింగ్స్
సాహిల్ ఫర్హాన్ (పాకిస్థాన్) – 848 రేటింగ్స్
అభిషేక్ శర్మ (భారత్) – 819 రేటింగ్స్
ఫిల్ సాల్ట్ (ఇంగ్లాండ్) – 799 రేటింగ్స్
పాథుమ్ నిస్సంక (శ్రీలంక) – 751 రేటింగ్స్

# పాక్‌ను కట్టేసిన విండీస్ పేస్..



### విండీస్ పేసర్ల సంచలనం.. మ్యాచ్‌లోని మొత్తం 40 వికెట్లూ పేసర్లకే!
### సిరీస్‌లో వెస్టిండీస్ 1-0 ఆధిక్యం.. సోబెర్స్‌కు విజయం అంకితం

బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్ పేస్ దళం ధాటికి పాకిస్థాన్ క్రికెట్ జట్టు మోకాళ్లూరింది. స్వదేశంలో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను 90 పరుగుల తేడాతో వెస్టిండీస్ చిత్తు చేసింది. 211 పరుగుల లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన పాక్.. విండీస్ పేసర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 120 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో రెండు జట్లకు చెందిన మొత్తం 40 వికెట్లనూ పేస్ బౌలర్లే పడగొట్టడం ఒక అరుదైన విశేషం. టెస్టు క్రికెట్ సుదీర్ఘ చరిత్రలో ఒకే మ్యాచ్‌లోని అన్ని వికెట్లను పేసర్లే సాధించడం ఇది కేవలం ఆరోసారి మాత్రమే. కాగా, పాక్‌పై విండీస్ పేసర్లు ఒకే మ్యాచ్‌లో 20 వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో వెస్టిండీస్ 1-0 ఆధిక్యం సాధించింది.

బాబర్ ఒంటరి పోరాటం వృథా.. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 311 పరుగులు చేయగా, పాకిస్థాన్ 282 పరుగులకే పరిమితమైంది. అనంతరం వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌట్ కావడంతో, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి పాక్ ముందు 211 పరుగుల లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 57/6తో తీవ్ర కష్టాల్లో నిలిచిన పాకిస్థాన్‌ను కెప్టెన్ బాబర్ అజామ్ (58 నాటౌట్) ఒంటరి పోరాటంతో గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. అద్భుత హాఫ్ సెంచరీ సాధించినా, మిడిలార్డర్ బ్యాటర్ల నుంచి అతనికి ఎలాంటి సహకారం లభించలేదు. చివరి బ్యాటర్ మహమ్మద్ అబ్బాస్ (23)తో కలిసి కాసేపు పోరాడినా లాభం లేకపోయింది. విండీస్ యువ పేసర్ జైడెన్ సీలెస్ ఐదు వికెట్లతో (5/20) పాక్ పతనాన్ని శాసించాడు.

సోబెర్స్‌కు ఘన నివాళి: రోస్టన్ ఛేజ్ ఇటీవలే కన్నుమూసిన వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం సర్ గ్యారీఫీల్డ్ సోబెర్స్ జయంతి నేడు కావడం విశేషం. ఈ చారిత్రాత్మక విజయాన్ని తాము సోబెర్స్‌కు అంకితం ఇస్తున్నట్లు విండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ ఎంతో భావోద్వేగంతో వెల్లడించాడు. కాగా, రెండు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా ఆగస్టు 2 నుండి ప్రారంభం కానుంది.

మ్యాచ్ హైలైట్స్ & రికార్డులు:

గ్రీవ్స్ సరికొత్త చరిత్ర: ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు తీసిన జస్టిన్ గ్రీవ్స్ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు. టెస్టుల్లో వరుసగా ఐదు ఓవర్లలో ఐదు వికెట్లు తీసి, ఒకే పరుగు కూడా ఇవ్వకుండా సృష్టించిన వరల్డ్ రికార్డు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

బ్రాడ్ రికార్డు బద్దలు: 2016లో దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ నమోదు చేసిన వరుస నాలుగు వికెట్ మెయిడిన్ల రికార్డును జస్టిన్ గ్రీవ్స్ ఈ మ్యాచ్‌తో బద్దలు కొట్టాడు.

పాక్ ఘోర పరాజయాల పరంపర: పాకిస్థాన్ జట్టు విదేశీ గడ్డపై వరుసగా ఎనిమిదో టెస్టులో ఓటమి చవిచూసింది. చివరిసారిగా 2023లో శ్రీలంకపై గెలిచిన పాక్, ఆ తర్వాత విదేశాల్లో ఆడిన అన్ని టెస్టుల్లోనూ పరాజయం పాలైంది.

విండీస్ ఫామ్: గత 11 టెస్టు మ్యాచుల్లో వెస్టిండీస్ జట్టుకు ఇది రెండో విజయం మాత్రమే. చివరిసారిగా శ్రీలంకపై గెలిచిన విండీస్, ఆ తర్వాత ఏడు మ్యాచుల్లో ఓడి, రెండు మ్యాచ్‌లను డ్రా